RNI. No. TELTEL /2022/ 89348




మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు దిన ప త్రి క

సంపుటి : 4 సంచిక : 98 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | బుధవారం, ఏప్రిల్,01, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## యూసీసీ, లవ్ జిహాద్‌పై చట్టం..

### ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన అసోం బీజేపీ



గుహవటి: అసోంలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించింది. రాజధాని గుహవటిలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ సైకియా తదితరులు మేనిఫెస్టో విడుదల చేశారు. సంకల్ప పాత్ర పేరుతో రూపొందిన ఈ మేనిఫెస్టోలో బంగ్లాదేశీయులను రాష్ట్రం నుంచి పంపించడంతోపాటు యూసీసీ చట్టంపై కూడా ప్రజలకు హామీ ఇచ్చింది. మూడోసారి ఎన్నికైతే అసోం యాక్ట్ 1950 ప్రకారం రాష్ట్రం నుంచి బంగ్లాదేశీయులను తరిమేస్తామని సీఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు. 24 గంటల్లోగా జిల్లా అధికారులతో కలిసి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చిన వారిని పంపించేస్తామని ప్రకటించారు. ఒక్క అంగుళం భూమిని కూడా అసోం నుంచి వారికి ఇవ్వబోమన్నారు. అసోంలో యూసీసీ (యునిఫాం సివిల్ కోడ్) అమలు చేయడంతోపాటు, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌ను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. రాబేయే ఐదేళ్లలో బంగ్లాదేశీ వలసదారులైన మియాల మూలాల్ని దెబ్బతీస్తామని చెప్పారు. మేనిఫెస్టోలోని కీలక అంశాలివి. ఐదేళ్లలో అసోంను వరదల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటం. మొదటి రెండేళ్లలో వరదల నివారణ కోసం రూ.18,000 కోట్లు కేటాయింపు. యూసీసీకి సంబంధించి ఆరో షెడ్యూల్ ప్రకారం గిరిజన ప్రాంతాలను మినహాయిస్తారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం. ఐదేళ్లలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు. ఒరునోదయ్ స్కీం కింద ప్రస్తుతం మహిళలకు అందిస్తున్న రూ.1,250ని రూ.3,000కు పెంచుతారు. అలాగే రాష్ట్రంలో ఉచిత విద్యను అందిస్తారు. తేయాకు తోటల్లో పని చేసే కార్మికులకు రోజువారీ వేతనం రూ.500కు పెంపు. రవాణా రంగానికి రూ.5 లక్షల కోట్లు కేటాయింపు. ముఖ్యమంత్రి మహిళా ఉద్యమిత స్కీం కింద మహిళలకు రూ.25,000 ఆర్థిక సాయం. వన్ డిస్ట్రిక్, వన్ ఇనిస్టిట్యూషన్ మోడల్ కింద ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్, ఒక యూనివర్సిటీ, ఒక ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తారు.

### మాతా శీతలాష్టమి ఆలయంలో తొక్కిసలాట..

## 8 మంది భక్తులు మృతి



నలంద: బీహార్‌లోని నలంద జిల్లాలో ఇవాళ తొక్కిసలాట జరిగింది. మాఘ్రా గ్రామంలో ఉన్న శీతలాష్టమి ఆలయం లో ఈ ఘటన జరిగింది. తొక్కిసలాటలో సుమారు 8 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయివారిలో అందరూ మహిళలే ఉన్నారు. మరో డజను మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు 5 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో.. భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. తొక్కిసలాట తర్వాత ఆలయం వద్ద భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అనేక మంది మహిళలు స్పృహ తప్పి పడిపోయి ఉన్న దృశ్యాలు కనిపించాయి. మృతిచెందిన భక్తుల్లో ఇద్దర్ని గుర్తించారు. గాయపడ్డవారిని చికిత్స కోసం స్థానికంగా ఉన్న మోడల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చైత్రమాసంలోని కృష్ణపక్షం 8వ రోజు అష్టమి కావడంతో.. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం ఆలయానికి తరలివచ్చారు. శీతలాష్టమి రోజున స్థానికులు తమ ఇండ్లల్లో పొయ్యిలు వెలిగించరు. ముందు రోజు వండిన వంటను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇక అష్టమి రోజున ఈ ఆలయంలో భారీ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అమ్మవారి దర్శనం కోసం భారీ క్యూలైన్లు ఉంటాయి.

### ఎన్నికల నియమావళి ఉల్లంఘన..

## టీవీకే చీఫ్ విజయ్‌పై కేసు నమోదు



**చెన్నై,మార్చి,31:**తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ చీఫ్ విజయ్‌కు ఎన్నికల సంఘం షాకిచ్చింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విజయ్‌పై ఈసీ కేసు నమోదు చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించినందుకు పెరావల్లూర్ పోలీస్ స్టేషన్‌లో విజయ్‌పై కేసు నమోదైంది. ఒక పబ్లిక్ మీటింగ్ సందర్భంగా రూల్స్ అతిక్రమించినందుకుగాను, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్‌పై కేసు రిజిష్టర్ చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.దీంతో రాష్ట్రమంతా ఎన్నికల వేడి మొదలైంది. ఈ నేపథ్యంలో టీవీకే చీఫ్ విజయ్ రాష్ట్రమంతా పర్యటిస్తున్నారు. ఇటీవల ఒక బహిరంగ సభ సందర్భంగా నిబంధనల్ని ఉల్లంఘించినట్లు ఈసీ ఆరోపించింది. అధికారుల అనుమతి లేకుండా సభలో ఏకంగా 30 లౌడ్ స్పీకర్లు ఉపయోగించాడని, అలాగే 5,000 మందికి మించి ప్రజలు సభకు హాజరయ్యారని, దీనివల్ల ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఆరోపిస్తూ ఈసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, రోడ్లు బ్లాక్ చేయడం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాల్ని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విజయ్‌పై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదైంది. విజయ్‌తోపాటు సభకు హాజరైన దాదాపు 5,000 మంది పార్టీ కార్యకర్తల్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు సమాచారం.

## ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్



**న్యూఢిల్లీ,మార్చి,31:**ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం.. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యులు కొన్ని రోజులపాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది.సోనియా పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం.. ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆమె అభిమానులు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎల్డీఎఫ్ గెలుపును కోరుకుంటున్న మోదీ..
## విమర్శలు గుప్పించిన రాహుల్



కన్నూరు: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ , బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు.

### నేటినుంచి తెలంగాణలో

## చికెన్ షాపులు బంద్




**హైదరాబాద్,మార్చి,31:** రిటైల్ చికెన్ షాపులకు ఇచ్చే మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్. దీనిలో భాగంగా రేపట్నుంచి(బుధవారం, ఏప్రిల్ 1వ తేదీ) రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేస్తున్నట్లు వెల్లడించింది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే లాభం (మార్జిన్) తగ్గించడంతో వ్యాపారులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఈ మార్జిన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తోంది చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్. గతంలో పౌల్ట్రీ వాళ్ళు రిటైల్ షాపులకు కేజీకి 26 రూపాయలు మార్జిన్ ఇచ్చే వారని, గత 20 ఏళ్ళుగా 26 రూపాయలే మార్జిన్ ఉందని, కానీ ఇటీవల మార్జిన్‌ను16 రూపాయలకు తగ్గించారని, ప్రస్తుతం కేజీ చికెన్‌కు మార్జిన్ 30 రూపాయలు చేయాలని డిమాండ్ చేస్తుంది. అసోసియేషన్ నాయకుల చెబుతున్న దాని ప్రకారం, ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభం చాలా తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు జీవనోపాధి కొనసాగించడం సవాల్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్జిన్‌ను తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ, తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులు బంద్ పాటించనున్నట్లు ప్రకటించారు.

## గనుల భూములను పచ్చని ఆస్తులుగా మలిచిన సింగరేణి





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) శ్రీ బానోత్ కర్ణ నాయకత్వంలో ఆర్‌జీ-1లో వినూత్న పునరుద్ధరణ, 100% మొలకెత్తింపు తో పచ్చదనం పరుచుకున్న ఓబీ డుంపులు శాస్త్రియ పద్దతిలో టింబర్ కొనుగోలుతో కంపనికి 1.60 కోట్ల ఆదా ఓబీ డంప్‌లపై శాస్త్రీయ పునరుద్ధరణలో సింగరేణి విజయ గాధ ఆర్‌జీ-1 అటవీ విభాగం వినూత్న విధానాలతో పచ్చదనం విస్తరణ -- ప్రజా భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం సింగరేణిలో పచ్చ విప్లవం బానోత్ కర్ణ ఆధ్వర్యంలో గనుల భూముల మార్పు వనమహోత్సవంలో సీఎండీ, ఎమ్మెల్యే, కంపెనీ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు మరియు అధికారులు.

## రాజకీయాల్లోకి జీవన్ రెడ్డి కోడలు చరిష్మారెడ్డి!



**హైదరాబాద్,మార్చి,31:** తెలంగాణ పాలిటిక్స్ క్రమంగా ఊపందుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పటై 27 నెలలు గడుస్తోంది. ఈ ప్రభుత్వానికి అధికారం మరో రెండున్నరేళ్లు మిగిలి ఉండగానే రాబోయే ఎన్నికలపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. మరోసారి అధికారం తమదేనంటూ రేవంత్ రెడ్డి పదే పదే చెబుతుంటే, మళ్లీ మిమ్మల్ని రానిచ్చేది లేదంటూ విపక్షాలు స్కెచ్చులు వేస్తున్నాయి. అయితే పార్టీల మధ్య పోరు ఇలా ఉంటే వచ్చే ఎన్నికల నాటికి తమ వారసులను బరిలోకి దింపేందుకు నేతలు గ్రౌండ్ వర్క్ పక్కాగా ప్రిపేర్ చేస్తుండటం ఆసక్తిని రేపుతోంది. దీపం ఉండగానే ఇంటిని చక్కబెట్టుకోవాల న్నట్లు అవకాశాలు ఉన్నప్పుడే తమ వారసులకు బెర్త్ లను సెట్ చేసేందుకు సీనియర్ నేతలు స్కెచ్‌లు వేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి విషయంలో ఓ ఆసక్తికర చర్చ తెరమీదకు వచ్చింది. చరిష్మారెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు పొలిటికల్ కారిడార్?లో ప్రచారం జరుగుతోంది. కోడలిని బరిలోకి దింపడానికి పెద్దాయన గ్రౌండ్ రెడీ చేస్తున్నారని ఈ వ్యూహంలో భాగంగానే ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారనే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకోబోతున్నారని అక్కడ జీవన్ రెడ్డికి సెక్రటరీ జనరల్ పోస్టు అందుకోనుండగా కోడలికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

# సంపాదకీయం

## అమెరికాను మించి ఇజ్రాయెల్..!

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్?ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది.దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది. ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు.ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బందాన్ని బలోపేతం చేశాయి.ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్యసమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. రక్షణ, వ్యవసాయం, అఐ రంగాల్లో సహకారం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది.ఈ చరిత్రాత్మక సంఘటనలు రెండు దేశాల సంబంధాన్ని విశ్వాసంతో బలపరుస్తున్నాయి. భవిష్యత్తులో సైబర్ భద్రత, డ్రోన్ సాంకేతికతల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఆశిస్తున్నాయి. ఇది భారత్ మధ్యప్రాచ్య వ్యూహంలో కీలకమవుతుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి కలిశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయం లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ ? ఇజ్రాయెల్ మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజేపీ, సంఘ్ పరివార్ మొదటి నుంచి ఇజ్రాయెల్ అనుకూలంగా ఉ నానయి. ఇజ్రాయెల్ ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తుంది. అందుకే బీజేపీ, సంఘ్ ఇష్టపడతాయి.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్?ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు ? శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు. కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు.రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకాశాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో త్వరలో ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వానికి సమావేశం నిర్వహించే ప్రణాళికలను ఆయన ప్రకటించారు. మరిన్ని చర్చలకు ప్రముఖ మంత్రులను ఆహ్వానించే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఇరాన్‌పై అమెరికా దాడి సందర్భంలో ఇజ్రాయెల్ మద్దతు, గల్ఫ్ దేశాల ఒత్తిళ్లు భారత్‌ను కష్ట పరిస్థితిలో ఉంచవచ్చు.మోదీ పర్యటన భారత్ మధ్యప్రాచ్య వ్యూహాన్ని ప్రభావితం చేస్తుంది. ఇరాన్ వ్యతిరేక చర్యలకు మద్దతుగా కనిపించడం దీర్ఘకాలంలో దక్షిణ ఆసియా సంబంధాలను దెబ్బతీస్తుంది. రెండు దేశాల సహకారం లాభదాయకమైనా, భౌగోళిక రాజకీయాలు జాగ్రత్తలు పాటించాలి.

# ఆర్జీ. 1 వివిధ విభాగాల విభాగాల అధికారులతో ఆర్జీ.1 జియం లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం ఏరియా 1 జియం కార్యలయం నందు గుర్తింపు సంఘం ప్రతినిధులతో మరియు ఆర్జీ. 1 వివిధ విభాగాల విభాగాల అధికారులతో ఆర్జీ.1 జియం లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగినది. దీనికి జియం గారు సానుకూలంగా స్పందించడము జరిగినది. ఈ సందర్భంగా జియం తెలియజేస్తూ గత నెలలో జరిగిన నిర్మాణాత్మక సామావేశంలో తీసుకున్న నిర్ణయాలు కొన్ని పరిష్కారం జరిగినవని మరికొన్ని జరగవలసి ఉన్నదని అన్నింటికి సనుకాల వాతావరణంలో పరిష్కారం జరుగుతావని తెలిపారు. ఇదేవిధంగా సహకరిస్తూ రాబోవు రోజులలో జిడికె 1ఉ3 మరియు జిడికె 2ఉ2ఎ గనులలో వచ్చే ఆర్థిక సంవత్సరం పూర్తి కేటాయించిన లక్ష్యాలను సాధించగలమని తెలిపారు. మరియు రాబోవు రోజులలో గనులలో అడ్రియాల ప్రాజెక్ట్ లో వాడిన కేబుల్ పద్ధతిలో 6 మీటర్ల నుండి 60 వేల టన్నుల బండను ఆపగలిగే రూఫ్ బోల్ట్ సిస్టం అందుబాటులో ఉ ంటుందని తెలిపారు. ఈ నెలలో జిడికె 11 ఇంక్లైన్ ఒక్కరోజులో రికార్డు బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగినదని ఇక్కడ త్వరలోనే 3వ కంటిన్యుస్ మైనర్ యంత్రం రాబోవుచున్నదని తెలిపారు. మరియు సి.యస్.పి అత్యధిక రికార్డు రేక్స్ సరఫరా చేయడం జరిగినదని తెలిపారు. వారికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకుపోవడానికి అందరు సహకరించాలని తెలిపారు.

మార్చి 2026 స్ట్రక్చర్ కమిటీ డిమాండ్లు

1) సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని గనులలో బిట్లు మరియు డ్రిల్ రాడ్స్ కొరత ఉన్నది (కోల్ మరియు స్టోన్) నాలుగు ఫిట్లు గల డ్రిల్ రాడ్స్ మరియు నట్ బోల్ట్స్ నాణ్యమైనవి సరఫరా చేయాలి.

2). జిడీకే 1 ఇంక్లైన్ లో మ్యాన్ రైడింగ్ సిస్టం ను సర్ఫేస్ నుండి ఏర్పాటు చేయగలరు. అదేవిధంగా వన్ ఇంక్లైన్ లో కార్మికులకు కన్వేయర్ ఆపరేటర్ ప్రమోషన్ లు ఇవ్వాలి.

3). అండర్ గ్రౌండ్ మైన్ లలో ఎల్ హెచ్ డీ మరియు ఎస్ డి ఎల్ యంత్రాలను కొత్తవి ఏర్పాటు చేయాలి.

4). ఆర్జీ1 జిఎం ఆఫీస్ నందు దుర్గామాత ఆలయాన్ని నిర్మించాలి.

5). జిడికే 11వ ఇంక్లైన్ లో మూడో మ్యాన్ రైడింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలి.

6). ఏరియా వర్క్ షాప్ లో అంతర్గత రోడ్లు మరియు షెడ్ల కు రేకులు మార్చాలి.

7). కాంట్రాక్ట్ కార్మికులకు మరియు ఓసపి 5 లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేసవి కాలంలో ఎండల తీవ్రత దృష్ట్యా పని వేళలను మార్చాలి.

8). ఓసిపి 5 లో కొత్త డంపర్ లను ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరి రంగు



శ్రీను, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఎజియం ఐ.ఇ.డి ఆంజనేయులు, ప్రాజెక్ట్ అధికారి రమేష్, ఏజెంట్స్ చిలుక శ్రీనివాస్, యల్ రమేష్, ఎఐటియుసి నాయకులు మదమ మహేష్, వెంకట రెడ్డి, సిద్దమల్ల రాజు, విజయ లక్ష్మి, మల్లిఖార్జున్ మరియు అధికారులు, రామమోహనరావు, ఫైడిశ్వార్,వరప్రసాద్, నారాయణ మూర్తి, డివై పి.యం వేణు, సీనియర్ పివోలు శ్రావణ్ కుమార్ , హన్మంత రావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కాలువలో వ్యర్థాలు వేయకుండా సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) కాలువలో వ్యర్థాలు వేయకుండా పళ్ళు, కూరగాయలు, మాంసం వ్యాపారులు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. శివాజీ నగర్ మార్కెట్ వ్యాపారస్థులతో నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యాపారి గురువారం లోపు రెండు బకెట్లు (పచ్చ రంగు , నీలం రంగు) ఏర్పాటు చేసుకొని అందులో మాత్రమే చెత్త వేయాలని అన్నారు.మునిసిపల్ వాహనాల ద్వారా బకెట్ లలో చెత్త తీసుకువెళ్తారని అన్నారు. ఉదయం సందర్శనలో కాలువ పరిశీలించినప్పుడు పళ్ళు,కూరగాయలు, మాంసం వ్యర్థాలు గమనించడం జరిగిందని అన్నారు. తద్వారా వ్యాపారులతో పాటు చుట్టు ప్రక్కల కాలనీ వాసులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. తడి చెత్తను రీ సైకిలింగ్ చేసే బయో గ్యాస్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని అన్నారు. స్వచ్ఛ రామగుండం గా మారడానికి మార్కెట్ వ్యాపారులు చెత్త కాలువలో వేయకుండా సహకరించాలని కోరారు. ఎవరైనా చెత్త వేస్తే రూ.500/-జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. పునరావృతమైతే మార్కెట్ నుండి ఖాళీ చేయిస్తామని అన్నారు. సి.సి.కెమెరాలతో కూడా నిఘా ఏర్పాటు చేసి జరిమానాలు విధిస్తామని అన్నారు. దుకాణంలో అపరిశుభ్రత లేకుండా జాగ్రత్తలు తీసుకొని మాంసం విక్రయాలు జరపాలని అన్నారు. వినియోగదారులకు, విక్రయదారులకు ఆహ్లాదకరంగా ఉండేలా ఎం ఎల్ ఏ సూచనల ప్రకారం అందమైన, స్వచ్ఛమైన మార్కెట్ గా తీర్చిదిద్దాల్సిన భాద్యత మనందరిపై ఉందని అన్నారు. తమ ఇంటిని శుభ్రంగా ఉంచుకున్న మాదిరిగా మార్కెట్ ను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.సుమారు 3 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన షెడ్ ఏప్రిల్ చివరి వారం వరకు అందుబాటులోకి వస్తుందని అన్నారు.రోడ్లు, యు జి డి ,రైతులకు రెస్ట్ రూమ్స్, మరుగు దొడ్లు తదితర వసతులు కల్పిస్తామని అన్నారు. మార్కెట్ లో ఆర్ ఓ ప్లాంట్ కూడా ఏర్పాటు చేసి త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. కావున వ్యాపారస్తులు సహకరించి రెండు డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని ఈ మేరకు మరో రెండు రోజుల్లో తనిఖీ లు నిర్వహించి డబ్బాలు షాపు ముందు లేకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు .వ్యాపారస్తులు కోరిన విధంగా మార్కెట్ లో అనుచిత కార్యకలాపాలు జరగకుండా పోలీసుల సహకారంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పశువులను తరలిస్తామని హామీ ఇచ్చారు. బయట చేపలు విక్రయించిన తరువాత చెత్త అక్కడే వదిలిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అద్దె బకాయిలు సక్రమంగా గా చెల్లించాలని అన్నారు. ఈ మేరకు తమ మార్కెట్ శుభ్రంగా ఉ ంచుకుంటామని వ్యాపారులు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి వి రామన్, టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ , తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి స్వామి మేయర్ ఐనందుకు 108 కొబ్బరికాయలతో మొక్కు తీర్చుకున్న పొన్నం అంజయ్య గౌడ్



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) స్థానిక పవర్ హౌస్ కాలనీ గడ్డమీద హనుమాన్ గుడిలో మహంకాళి స్వామి మేయర్ మేయర్ కావాలనిపొన్నం అంజయ్య గౌడ్ ఈరోజు 108 కొబ్బరికాయలతో మొక్కు తీర్చుకున్న పొన్నం అంజయ్య గౌడ్ ఎలక్షన్ కు ముందు మహంకాళి స్వామి మేయర్ అయితే హనుమాన్ గుడిలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటామని కోరిక కోరితే అనుకున్న కోరిక నెరవేరినందున మేయర్ మహంకాళి స్వామి చేతుల మీదుగా మొక్కు తీర్చుకున్నడు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సాంబ మూర్తి బండి రమేష్ గౌడ్, బెందే నాగభూషణం గౌడ్, ఐరెన్.యాదగిరిగౌడ్, ఐరెని ప్రవీణ్ గౌడ్, మ్యడా గోని రవిగౌడ్, కదిరె సురేష్ గౌడ్, రాజు గౌడ్,దిలీప్ గౌడ్,బుర్ర.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష

**అమరావతి,మార్చి,31:**రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల్లోకి వెళ్లి ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా, ప్రతి నెలా నాలుగో శనివారాన్ని 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్' దినంగా పాటించాలని, ఆ రోజున గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో 'సంజీవని' ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో విజయవంతంగా అమలవుతున్న సంజీవని ప్రాజెక్టును జూలై నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు. రాబోయే ఏడాదిలో రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పరీక్షల ఫలితాలను 48 గంటల్లోనే నేరుగా వారి వాట్సప్‌కు పంపాలని ఆదేశించారు. , రూ.162 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు వివరించగా, ముఖ్యమంత్రి వెంటనే ఆమోదం తెలిపారు. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో ఇప్పటికే 3.14 లక్షల మంది నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

## పశ్చిమాసియా సంక్షోభం.. 5.72 లక్షల మంది భారతీయులు స్వదేశానికి!

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడి నుంచి భారతీయులను స్వదేశానికి తరలించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5.72 లక్షల మంది ప్రయాణికులు పశ్చిమాసియా దేశాల నుంచి సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ఇవాళ వెల్లడించింది. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో నేడు సుమారు 8 నుంచి 10 ప్రత్యేక వాణిజ్య విమానాలు భారత్‌కు రానున్నాయని తెలిపింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం.. యూఏఈ నుంచి రోజుకు సుమారు 85 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒమన్, సౌదీ అరేబియా నుంచి కూడా భారత్‌కు విమానాలు నడుస్తున్నాయి. అయితే, కువైట్, బహ్రెయిన్ గగనతలాలు ఇంకా మూసివేసే ఉండటంతో ఆ మార్గాల్లో సర్వీసులు నిలిచిపోయాయి. సౌదీ అరేబియాలోని దమ్మామ్ విమానాశ్రయం నుంచి మాత్రం భారత్‌లోని వివిధ నగరాలకు ప్రత్యేక విమానాలు నడుస్తున్నాయి. పలు దేశాల్లో గగనతలాలు మూసివేయడంతో భారతీయుల ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను సులభతరం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇరాన్ గగనతలం మూసివేత కారణంగా ప్రయాణికులను ఆర్మేనియా, అజర్‌బైజాన్ మీదుగా తరలిస్తున్నారు. అలాగే, ఇజ్రాయెల్‌లో ఆంక్షల దృష్ట్యా ఈజిప్ట్, జోర్డాన్ ద్వారా.. ఇరాక్ గగనతలం మూసివేతతో జోర్డాన్, సౌదీ అరేబియా ద్వారా భారతీయుల ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి భారతీయ సమాజంతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారి భద్రతకు అవసరమైన సహాయం, సూచనలు అందిస్తున్నట్లు ప్రభుత్వం వివరించింది. మరోవైపు సముద్ర జలాల్లోని భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని పోర్ట్స్, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

### - ఆర్‌ఎస్ ప్రవీణ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,మార్చి,31:**కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ పాలిస్తోందని రేవంత్ రెడ్డి కాదని.. చంద్రబాబు పాలిస్తున్నారని ఆరోపించారు. ఏ పాలకుల మీదైతే పోరాడి తెలంగాణ సాధించుకున్నామో మళ్లీ ఆ పాలకులే రాజ్యమేలుతున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నామమాత్రంగా సీఎం కుర్చీలో కూర్చుకున్నారని.. పరిపాలన మొత్తం ఆంధ్రా పాలకులకే అప్పజెప్పారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకూడదనే అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ప్రవేశ పెట్టారని విమర్శించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన విద్వేషపూరిత ప్రసంగం, నేరాల నివారణ బిల్లు సోషల్‌మీడియాను కట్టడి చేయడానికేనని స్పష్టం చేస్తున్నది. దీంతో పాటు రాజకీయ పార్టీలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాపైనా ప్రభావం పడే అవకాశముంది. వాట్సాప్ గ్రూపులో అడ్మిన్ ఏదైనా పోస్ట్ పెడితే సంబంధిత వ్యక్తిపై మాత్రమే చర్యలు తీసుకునే అవకాశం ఇప్పటివరకు ఉండేది. కానీ, ఈ చట్టంతో గ్రూపు సభ్యులపైనా కేసులు నమోదు చేసే అవకాశముంది.




# ఆర్‌జీ-1 అటవీ విభాగం -- గనుల భూములను పచ్చని ఆస్తులుగా మలిచిన విశేష విజయాలు (2025--26)



## గనుల భూములను పచ్చని ఆస్తులుగా మలిచిన సింగరేణి బానోత్ కర్ణ నాయకత్వంలో ఆర్‌జీ-1లో వినూత్న పునరుద్ధరణ,

- 100% మొలకెత్తింపు విజయాలు
- రూ 1.60 కోట్ల ఆదా
- ఓబీ డంప్‌లపై శాస్త్రీయ పునరుద్ధరణలో సింగరేణి విజయ గాధ
- ఆర్‌జీ-1 అటవీ విభాగం వినూత్న విధానాలతో పచ్చదనం విస్తరణ
- -- ప్రజా భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం
- సింగరేణిలో పచ్చ విప్లవం
- బానోత్ కర్ణ ఆధ్వర్యంలో గనుల భూముల మార్పు
- వనమహోత్సవంలో సీఎండీ, ఎమ్మెల్యే మరియు కంపెనీ డైరెక్టర్లు















(తెలంగాణ అవతరణ ప్రతినిధి మార్చి 31)సింగరేణి కొలియరీస్ కంపెనీ లిమిటెడ్ ఆర్‌జీ-1 ప్రాంత అటవీ విభాగం 2025--26 సంవత్సరంలో గనుల వల్ల దెబ్బతిన్న భూములను పచ్చని పర్యావరణ ప్రాంతాలుగా మలచడంలో విశేష ఫలితాలను సాధించింది. ఈ కార్యక్రమాలన్నీ ఆర్‌జీ ప్రాంత అటవీ విభాగం డీజీఎం శ్రీ బానోత్ కర్ణ గారి నాయకత్వంలో సమర్థవంతంగా అమలు చేయబడ్డాయి. ఈ సంవత్సరంలో సుమారు 32 హెక్టార్ల బ్లాక్ ప్లాంటేషన్, 61 హెక్టార్ల ఓబీ డంప్ ప్లాంటేషన్, 23 కిలోమీటర్ల అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టబడింది. అదనంగా సుమారు 0.75 లక్షల మొక్కలు ప్రజలకు మరియు ఉద్యోగులకు పంపిణీ చేయబడ్డాయి. మొదటిసారిగా రాతి క్వారీ ప్రాంతాలలో శాస్త్రీయ పద్ధతులతో ప్లాంటేషన్ చేపట్టి సుమారు 90% జీవన శాతం సాధించడం ద్వారా గనుల ముగింపు నిధులను సమర్థంగా వినియోగించడంలో ఆదర్శంగా నిలిచింది. చెత్త మరియు బొగ్గు డంప్ ప్రాంతాన్ని 3 హెక్టార్ల మోడల్ ప్లాంటేషన్‌గా అభివృద్ధి చేసి "వేస్ట్ టు వెల్త్" భావనను విజయవంతంగా అమలు చేశారు. అగ్రోఫారెస్ట్రీ, అధిక సాంద్రత పండ్ల తోటల ద్వారా పర్యావరణ మరియు ఆర్థిక ప్రయోజనాలను కలిపి చూపించారు. ఓబీ డంప్ పునరుద్ధరణలో సాంప్రదాయ పద్ధతులకు బదులుగా శాస్త్రీయ విధానాన్ని ప్రవేశపెట్టారు. స్టైలోసాంథస్, క్రోటలేరియా, కందులు మొదట విత్తి, తరువాత అకేసియా, గ్లిరిసిడియా, సెస్బేనియా వంటి జాతులను నేలలో నాటడం ద్వారా దాదాపు 100% మొలకెత్తింపు సాధించారు. ఈ పద్ధతితో రెండు సంవత్సరాల్లో పూర్తిస్థాయి పచ్చదనం ఏర్పడింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్‌జీ-2 మరియు ఆర్‌జీ-3 ప్రాంతాలలో ఈకో పార్కుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. అలాగే ఎంఓసీపీ ప్రాంతంలో పునరుద్ధరించిన భూములను ప్రభుత్వ అటవీ శాఖతో సమన్వయం చేసి కంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూమిగా గుర్తింపు పొందేలా చర్యలు తీసుకున్నారు. "గ్రీనింగ్ రామగుండం" కార్యక్రమం కింద సుమారు 10.5 కి.మీ. రోడ్ల వెంట పచ్చదనం అభివృద్ధి చేయబడింది. ఈద్గాహ్ వంటి ప్రదేశాలలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ఉద్యోగులకు బంగినపల్లి, దసేరి మామిడి మొక్కలు పంపిణీ చేశారు. అటవీ విభాగం స్వచ్ఛ పఖ్వాడా, వృక్షారోపణ అభియాన్ వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో సింగరేణి సీఎండీ, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్యంగా రామగుండం ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే Kanha Shanti Vanam ప్రతినిధులు, ముఖ్యంగా రిటైర్డ్ పీసీసీఎఫ్ డా. రామకాంత్ గారు మరియు రిటైర్డ్ పీసీసీఎఫ్ ఒ ఎడ్వైజర్ (ఫారెస్ట్రీ), రాజబూ గారు పాల్గొని అటవీ కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా అటవీ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో: ఓబీ డంప్ పునరుద్ధరణ మోడల్స్ ఔషధ మొక్కల ప్రాధాన్యం హై డెన్సిటీ ఒ మియావాకి ప్లాంటేషన్లు (నగరాలలో గ్రీన్ లంగ్స్‌గా) ఎకోసిస్టమ్ పునరుద్ధరణ నమూనాలు తాసర్ పట్టు పురుగు జీవచక్రం మరియు కోకూన్ వినియోగం వర్మీ కంపోస్టింగ్ (ఇంటి వ్యర్థాల నుండి) జ్యోతిష్య ఆధారిత మొక్కల పెంపకం వంటి అంశాలను ప్రత్యక్ష మోడల్స్ రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల ద్వారా పాఠశాల విద్యార్థుల్లో మొక్కలు పెంచే అలవాటు పెంపొందించడంతో పాటు పర్యావరణంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఫీల్డ్ విజిట్లు నిర్వహించి, నర్సరీలో మొక్కల పెంపకం, సంరక్షణ మరియు ప్రకృతి సమతుల్యతలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. అటవీ విభాగం భూగర్భ గనుల కోసం అవసరమైన టింబర్ సమీకరణలో కీలక పాత్ర పోషించింది. ఇతర రాష్ట్రాల నుండి టింబర్ సేకరించి చాక్స్, ప్రాప్స్‌గా మార్చి సరఫరా చేయడం ద్వారా సుమారు ?1.60 కోట్ల ఆదా కంపెనీకి కలిగించింది. అలాగే గనుల విస్తరణలో పడిపోయిన యూకలిప్టస్ చెట్ల నుండి సుమారు 2000 ప్రాప్స్ తయారు చేసి వినియోగించారు. ఓబీ డంప్‌లపై నీటి వనరులు సృష్టించడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పడింది. ఈ కార్యక్రమాలలో డైరెక్టర్ (పీపీ), ఫంక్షనల్ డైరెక్టర్లు, ఈడీ (కోల్ మూవ్మెంట్), సీవీఓ మరియు ఏరియా జనరల్ మేనేజర్లు పాల్గొనడం అటవీ కార్యక్రమాలకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తుంది.మొత్తం మీద ఆర్‌జీ-1 అటవీ విభాగం, బానోత్ కర్ణ నాయకత్వంలో, శాస్త్రీయ పద్ధతులు, ఖర్చు నియంత్రణ, ప్రజా భాగస్వామ్యంతో గనుల పునరుద్ధరణలో ఆదర్శంగా నిలిచి సింగరేణి సంస్థకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

## పదవి విరమణ పొందుతున్న ఆడెపు తిరుపతి,

### ఆర్జీ. 1 జియం లలిత్ కుమార్ పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం ఏరియా.1 జియం కార్యలయం సివిల్ (క్వాలిటి) నందు 33 సంవత్సరముల విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న ఆడెపు తిరుపతి, జనరల్ అసిస్టెంట్, రామగుండం ఏరియా -1 జియం కార్యలయ సమావేశాహాలు నందు ఆర్జీ. 1 జియం లలిత్ కుమార్ పూలమాలలు మరియు శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి వారు చేసిన పనులను కొనియాడారు. ఈ సందర్భముగా జియం మాట్లాడుతూ వారు క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని, పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతి ఒక్కరూ పదవి విరమణ పొందుతారని, వారి శేష జీవితం సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. అనంతరం వారికి సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జియం చంద్రశేఖర్, డిజియం సివిల్ వరప్రసాద్, పర్సనల్ మేనేజర రవీందర్ రెడ్డి, ఎఐటియుసి జియం ఆఫీస్ ప్రతినిది రాజు, సి.ఎం.ఓ.ఐ ప్రతినిధి శ్రావణ్ కుమార్, డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, ఎన్విరాన్మెంట్ అద్శికారి వేణు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




## హైదరాబాద్‌లో తమిళనాడు మాజీ సీఎం జయలలిత ఇల్లు సీజ్

### పన్ను బకాయిలే కారణమన్న అధికారులు



హైదరాబాద్, మార్చి 31:తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి, 'అమ్మ' జయలలితకు చెందిన హైదరాబాద్ నివాసాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. నగరంలోని సంపన్న ప్రాంతమైన శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ ఇంటికి సంబంధించి భారీగా ఆస్తి పన్ను బకాయిలు ఉండటంతో అధికారులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. గడిచిన కొంతకాలంగా ఈ నివాసానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లించలేదని సమాచారం. బకాయిల చెల్లింపుపై ముందస్తు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఎటువంటి స్పందన లేకపోవడంతో జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు మంగళవారం ఉదయం అక్కడికి చేరుకుని ఇంటిని సీజ్ చేశారు. ప్రధాన ద్వారానికి తాళం వేసి, నోటీసును అంటించారు. జయలలిత తన సినీ కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు, అలాగే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్‌లోని ఈ నివాసంలో తరచూ గడిపేవారు.

## కొచ్చి చేరుకున్న నౌకలు.. తీరనున్న గ్యాస్ కొరత!

**న్యూఢిల్లీ,మార్చి,31:**మధ్యప్రాచ్య సంఘర్షణపై నెలకొన్న ఆందోళనల నడుమ.. ఎల్‌పీజీ, ముడి చమురు నౌకలు కొచ్చికి చేరుకుని వినియోగదారులకు ఉపశమనం కలిగించాయి. ఖతార్ నుంచి ఎల్‌పీజీని తీసుకువస్తున్న 'అపోలో ఓషన్' ట్యాంకర్ నిన్న మధ్యాహ్నం కొచ్చికి చేరుకుంది. ఈ ట్యాంకర్ 9,086 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీని తీసుకువస్తోంది. నిన్న మధ్యాహ్నం కొచ్చికి చేరుకున్న ట్యాంకర్, గ్యాస్‌ను దించిన తర్వాత తిరిగి వెళ్లే అవకాశం ఉంది.¯ ఆయిల్ కంపెనీకి చెందిన వివిధ బాట్లింగ్ ప్లాంట్‌లకు రవాణా చేస్తారు. కమర్షియల్ గ్యాస్ సరఫరాపై తీవ్రమైన ఆంక్షల నేపథ్యంలో, దిగుమతి చేసుకున్న ఎల్‌పీజీ రాక చమురు కంపెనీలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇదిలా ఉండగా.. రష్యా ముడి చమురు కూడా కొచ్చికి చేరుకుంది.

# ఇంతవరకూ ఒక్క హిట్టు పడలేదు



ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు.. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ – సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.

# డబుల్ ఫన్.. 'హాట్ స్పాట్ 2 మచ్'..



సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని, ఆలోచింపజేసే కథాంశాలతో ఈ సీక్వెల్‌ను రూపొందించారు. కేవలం వినోదం మాత్రమే కాకుండా, సమాజంలోని కొన్ని సున్నితమైన అంశాలను ఎత్తిచూపుతూ ఈ సినిమా ఉండబోతోందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.., ఎం.ఎస్. భాస్కర్, తంబి రామయ్య, అశ్విన్ కుమార్,

2024లో బాక్సాఫీస్ వద్ద, ఓటీటీలో వైవిధ్యమైన కంటెంట్‌తో సంచలనం సృష్టించిన చిత్రం 'హాట్ స్పాట్'. ప్రముఖ తెలుగు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ 'ఆహా'లో విడుదలై, విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను దక్కించుకుంది. ఇప్పుడు అదే ఉత్సాహంతో, ప్రేక్షకులకు రెట్టింపు వినోదాన్ని పంచడానికి సిద్ధమైంది దీని సీక్వెల్ 'హాట్ స్పాట్ 2 మచ్'. విలక్షణ దర్శకుడు విఘ్నేష్ కార్తిక్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సమకాలీన ఆదిత్య భాస్కర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిల్ రెడ్డి ఎం, ముని చంద్రారెడ్డి ఎన్, ఇందుకుమార్ ఎం. నిర్మించారు. ఈ చిత్రం నేడు నేరుగా 'ఆహా' వేదికగా విడుదలయ్యింది. మొదటి భాగం సృష్టించిన ఇంపాక్ట్‌తో, ఈ సీక్వెల్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బోల్డ్ అండ్ సోషల్ మెసేజ్ ఓరియెంటెడ్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు 'హాట్ స్పాట్ 2 మచ్' ఒక మంచి ఆప్షన్ కానుంది.

# మాస్ హీరో బాలయ్యతో వివేక్ ఆత్రేయ..






వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న నందమూరి బాలకృష్ణ, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విభిన్నమైన కథా చిత్రాల దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో బాలయ్య ఓ సినిమా చేయబోతున్నారనే వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ అనూహ్యమైన కాంబినేషన్‌పై ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బ్రోచేవారెవరురా, cఅంటే సుందరానికిc వంటి క్లాస్ చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న వివేక్ ఆత్రేయ, ఈసారి తన పంథాకు భిన్నంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు సరిపోయే భారీ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కథ స్పాన్ చాలా పెద్దదిగా ఉండటంతో దీనిని ఒకే సినిమాగా కాకుండా రెండు భాగాలుగా తెరకెక్కించాలా? అనే విషయంపై దర్శకనిర్మాతలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది. మాస్ హీరోను క్లాస్ చిత్రాల దర్శకుడు ఎలా ప్రెజెంట్ చేస్తాడనే కుతూహలం అభిమానుల్లో, సినీ వర్గాల్లో నెలకొంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. బాలయ్య ప్రస్తుతం దర్శకుడు గోపీచంద్ మలినేనితో ఓ సినిమాకు సిద్ధమవుతున్నారు. ముందుగా ఈ చిత్రాన్ని పీరియాడికల్ డ్రామాగా, బాలయ్యను మహారాజుగా చూపించాలని అనుకున్నప్పటికీ.. బడ్జెట్ కారణాల వల్ల కథలో మార్పులు చేశారు. తాజా సమాచారం ప్రకారం ముంబై మాఫియా నేపథ్యంలో సాగే కథలో బాలయ్య పవర్‌ఫుల్ డాన్‌గా కనిపించనున్నారు. ఈ సినిమా మార్చి 5న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుండగా, దసరాకు విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవైపు గోపీచంద్ మలినేనితో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్, మరోవైపు వివేక్ ఆత్రేయతో ప్రయోగాత్మక భారీ చిత్రం ఉండటంతో బాలయ్య లైనప్ ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తి రేపుతోంది. తన కెరీర్‌లోనే అత్యంత భారీ కథతో రాబోతున్న వివేక్ ఆత్రేయ, బాలయ్యను ఏ స్థాయిలో చూపిస్తారో చూడాలని అందరూ ఎదురుచూస్తున్నారు.

## మొన్న సౌత్ ఇండస్ట్రీపై విమర్శలు, ఇప్పుడు ప్రశంసలు..

# తాప్సీ పన్నూ 'యూటర్న్'పై చర్చ



సౌత్ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్‌లో స్థిరపడిన హీరోయిన్లలో తాప్సీ పన్ను ఒకరు. తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుని, తర్వాత హిందీ సినిమాల్లో వరుస అవకాశాలు అందుకున్న ఆమె× ఇటీవల చేసిన వ్యాఖ్యలు మళ్లీ సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. తాప్సీ తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టింది ఝుమ్మంది నాదం చిత్రంతో. దర్శకుడు కె. రాఘవేంద్రరావు తెరకెక్కించిన ఈ సినిమా ద్వారా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తెలుగులో వచ్చిన విజయాలే ఆమెకు బాలీవుడ్ వైపు అడుగులు వేసేలా చేసాయని సినీ విశ్లేషకుల అభిప్రాయం. అక్కడ కూడా కథానాయికగా కాకుండా, కంటెంట్ ఆధారిత సినిమాలతో నటిగా తనను నిరూపించుకునే ప్రయత్నం చేసింది. అయితే కొద్ది రోజుల క్రితం బాలీవుడ్‌లో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన తొలి తెలుగు సినిమా సమయంలో వర్క్ ఎక్స్‌పీరియన్స్ గురించి కొంత హేళనగా మాట్లాడినట్టు వార్తలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, తెలుగు ప్రేక్షకుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. సౌత్ సినిమాల వల్లే గుర్తింపు తెచ్చుకున్న నువ్వు, ఇప్పుడు అదే ఇండస్ట్రీపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు అంటూ పలువురు నెటిజన్లు మండిపడ్డారు. ట్రోల్స్ కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. దీంతో తాజాగా మరో ఇంటరాక్షన్‌లో తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన కెరీర్‌లో తెలుగు సినిమాల పాత్రను ప్రశంసించినట్టు తెలుస్తోంది. కోలీవుడ్ సినిమాల కంటే, తెలుగు ఇండస్ట్రీ వల్లే తనకు ఎక్కువ ఆదరణ, గుర్తింపు వచ్చిందని ఆమె చెప్పినట్టు సమాచారం. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో మరోసారి చర్చ మొదలైంది. కొందరు "తప్పు గ్రహించి మాట్లాడింది, మంచిదే" అంటుంటే, మరికొందరు "ఇది కేవలం ఇమేజ్ డ్యామేజ్ కంట్రోల్ మాత్రమే" అంటూ విమర్శిస్తున్నారు. సెలబ్రిటీల వ్యాఖ్యలు ఎప్పుడూ చర్చకు దారితీయడం సహజం. ముఖ్యంగా ఒక ప్రాంతంలో విజయాలు సాధించి, తర్వాత ఆ ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలు అభిమానులను బాధపెడతాయి. ఇప్పుడు తాప్సీ చేసిన ప్రశంసలను కొందరు సానుకూలంగా స్వీకరిస్తుంటే, మరికొందరు ఆమెని నమ్మడం లేదు. జరిగిన డ్యామేజ్ జరిగిపోయింది× ఇప్పుడు మాట్లాడితే సరిపోతుందా? అని అంటున్నారు.

# రెండు భాగాలుగా రానున్న 'స్వయంభు'



యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా స్వయంభుపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 ఏప్రిల్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించడంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది.

తాజాగా ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు నిఖిల్ స్వయంగా వెల్లడించడం విశేషం. కథ, విజువల్ గ్రాండియర్ దృష్ట్యా 'స్వయంభు'ను రెండు పార్ట్‌లుగా తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి మరింత రెట్టింపైంది. ఈ సినిమాలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ , నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్, భావోద్వేగాలతో కూడిన కథగా ఈ చిత్రం రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. 'స్వయంభు'తో పాటు నిఖిల్ చేతిలో మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కిస్తున్న సెన్సేషనల్ సీక్వెల్ కార్తికేయ 3పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే రామ్ వంశీ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న ది ఇండియా హౌస్ చిత్రం కూడా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రాలు నిఖిల్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే అవకాశముంది. కేవలం వెండితెరపైనే కాకుండా,

ఇప్పుడు నిఖిల్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నాడు. త్వరలోనే ఒక వెబ్ సిరీస్‌తో ఓటీటీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించాడు. విభిన్న కథాంశాలు, కొత్త కాన్సెప్ట్‌లతో ముందుకు సాగుతున్న నిఖిల్, తన కెరీర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నాడు. 'స్వయంభు'తో పాటు వరుస ప్రాజెక్టులతో నిఖిల్ సిద్ధార్థ్ తన పాన్ ఇండియా స్టార్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక రెండు భాగాలుగా రానున్న 'స్వయంభు' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# బాలీవుడ్ వర్సెస్ టాలీవుడ్

హైదరాబాద్,: సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించిన హీరోకి క్రేజ్ భారీ రేంజ్ లో మార్కెట్ ఉంటుంది. వాళ్ల నుంచి వచ్చిన సినిమాలను ప్రేక్షకులు అలరించడమే కాకుండా వాళ్ళు కనిపిస్తే చాలు వాళ్ళతో ఫోటోలు దిగడానికి కూడా ఎగబడిపోతుంటారు. ఇక ఇలాంటి క్రమంలోనే మన హీరోలు గత 10 సంవత్సరాల క్రితం వరకు తెలుగు సినిమాలకే పరిమితమయ్యారు. కానీ ఎప్పుడైతే బాహుబలి సినిమా వచ్చిందో అప్పటినుంచి పాన్ ఇండియా స్థాయిలో మన హీరోలు సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు? ఇక ఇప్పటివరకు మన హీరోలు టాప్ లో ఉండాలనే ఆలోచిస్తున్నారు. కానీ బాలీవుడ్ హీరో అయిన రణ్వీర్ సింగ్ దూరంధర్ సినిమాతో సైతం 1000 కోట్ల మార్కెట్ ను దాటేశాడు. అలాంటి సందర్భంలో వారిని తక్కువ అంచనా వేసి చూడకూడదు.మన ప్రయత్నంలో మనం ఉండాలి అలాగే వాళ్ళ కంటే బెటర్ సినిమాలను చేసి సూపర్ హిట్లను సాధించడానికి తీవ్రమైన కృషి చేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన కూడా మళ్లీ మన హీరోలు బీట్ చేసి వాళ్ళు ముందుకు దూసుకెళ్లే ప్రమాదం కూడా ఉంది?కాబట్టి ప్రతి విషయంలో మన వాళ్ళు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచిదని మరి కొంతమంది సినిమా మేధావులు సైతం మన హీరోలను, తద్వారా వీళ్ళకంటూ ఒక ఐడెంటిటీ క్రియేట్ అవుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే? ఖాన్ త్రయం పని అయిపోయినప్పటికి నెక్స్ట్ జనరేషన్ బాలీవుడ్ హీరోలందరు కూడా మంచి కాన్సెప్ట్ లను ఎంచుకొని సినిమాలు చేస్తున్నారు. కాబట్టి మన హీరోలు సైతం చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చేస్తూ తెలుగు ఇండస్ట్రీ స్థాయిని పెంచాల్సిన పరిస్థితి అయితే ఏర్పడింది? ఇక ఏది ఏమైనా కూడా ఇండియాలో ఇప్పుడున్న స్టార్ డైరెక్టర్లందరు మన హీరోల వైపే మొగ్గుచూపుతున్నారు.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411